క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌కు 17 అర్జీలు

నందిగామరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 17 అర్జీలు అందినట్లు వివరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఎనిమిది, పంచాయతీరాజ్ శాఖ ఒకటి, సర్వేశాఖకు ఆరు, విద్యా శాఖ ఒకటి, మున్సిపల్ శాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు వివరించారు. ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నందిగామ కమిషనర్‌గా లోవరాజు



నందిగామటౌన్: నందిగామ మున్సిపల్ కమిషనర్‌గా లోవరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న కమిషనర్ రమణబాబు గిద్దలూరుకు బదిలీకావడంతో ఆస్థానంలో తిరువూరు నుంచి లోవరాజు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు. కమిషనర్ లోవరాజుకు మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

శంభులింగేశ్వరునికి అభిషేకాలు



నందిగామరూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి వారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్వామివారికి అర్చకులు పంచామృతాలు, పలురకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు: స్థానిక యాదవబజార్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీసభ్యులు ఏర్పాట్లు చేశారు.


నేడు మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బీఎం విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

రక్తస్రావంతో గర్భిణి మృతి

కంచికచర్ల: ఓ గర్భిణీ అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన వేములపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కంచికచర్ల మండలం వేములపల్లి గ్రామానికి చెందిన ఊటుకూరు శ్రీనివాసరావుకు వీరులపాడు మండలం కొణతాలపల్లి గ్రామానికి చెందిన మేరీ(26)కి పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. ప్రస్తుతం మూడునెలల గర్భిణిగా ఉన్న మేరీ గత శుక్రవారం బొప్పాయి పండు తినడంతో రక్తస్రావం అవుతుండటంతో విషయాన్ని ఆదివారం తనభర్త శ్రీనివాసరావుకు తెలిపింది. ఆయన వెంటనే వైద్యచికిత్స కోసం పెండ్యాలలోని ఆర్‌ఎంపీ వైద్యుడు వద్దకు తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందింది.దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మేరీ మృతితో ఆమె బిడ్డలతోపాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటం చూపరులను కంటతడి పెట్టించింది.

పాఠ్యపుస్తకాల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక మిట్టగూడెం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు నాగరాజు, ఇర్రి నరసింహారావు, హెచ్‌ఎం హేమమాధవి, విద్యా కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నత్తనడకన సీసీఆర్ కార్డుల జారీ

- రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- సీసీఆర్ కార్డుల జారీలో తీవ్ర జాప్యం
- ఎదురుచూపుల్లో కౌలురైతులు
- లక్ష్యానికి దూరంగా కార్డుల జారీ
- ప్రభుత్వ తీరుపై రైతన్నల్లో ఆగ్రహం



పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

పెనుగంచిప్రోలు: వ్యవసాయరంగ అభివృద్ధి, రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పంటసాగు రైతులకు అందించే సీసీఆర్(పంటసాగు హక్కుపత్రం) కార్డుల జారీ నత్తనడకన సాగుతుండటమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కౌలురైతులకు ఈ కార్డులతో ఎంతో మేలు చేకూరుతుంది. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20వేలు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం గతేడాది ఈ పథకాన్ని అటకెక్కించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకూ ఈ పథకం ఊసే లేదు. ఇక పంటల సాగు చేపట్టే రైతులకు ఇచ్చే సీసీఆర్ కార్డుల జారీలోనూ తీవ్ర జాప్యం సాగుతుండటం గమనిస్తే, రైతు సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి ఉండే చిత్తశుద్ధి ఏపాటితో తెలిసిపోతోందని రైతులు చెబుతున్నారు.

సీసీఆర్ కార్డు ఉంటే..

కౌలురైతులకు ఈ గుర్తింపు కార్డులు ఉంటేనే బ్యాంకుల ద్వారా రుణసదుపాయం లభిస్తుంది. ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల జారీకి ప్రభుత్వ కూడా ఈ కార్డు ప్రమాణికంగా తీసుకుంటుండటంతో కౌలురైతులంతా సీసీఆర్ కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. ఇక వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సైతం సీసీఆర్ కార్డు తప్పనిసరి. కౌలురైతుల విషయంలో ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీసీఆర్ కార్డుల జారీ మాత్రం నందిగామ డివిజన్‌లో సజావుగా సాగకపోతుండటం రైతుల పాలిట శాపంగా మారింది.

కార్డుల జారీ నాలుగు శాతం మందికే..

డివిజన్ పరిధిలోని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో లక్ష్యానికి అనుగుణంగా సీసీఆర్ కార్డుల జారీ సాగడం లేదు. డివిజన్‌లో రెండు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో కలిపి గతేడాది 29074 సీసీఆర్ కార్డులు జారీచేయగా, ఈ ఏడాది 31,250 కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ 16వతేదీ వరకు కేవలం 1210కార్డులు మాత్రమే జారీ చేశారు. అంటే రెండున్నర నెలల్లో నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 4శాతం కంటే తక్కువగానే సీసీఆర్ కార్డులు జారీ చేయడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్తించిన మేరకు కౌలురైతులు అందరికీ ఈ సీసీఆర్ కార్డులు జారీచేయగా, ఈ ఏడాది కూటమి ప్రభుత్వంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో బ్యాంకు రుణాల ఊసే లేదు. దీంతో ఖరీఫ్ పెట్టుబడుల కోసం కౌలురైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పనిపరిస్థితి నెలకొంది.

సీసీఆర్ కార్డుల జారీ వివరాలు..

మండలం	గ్రామాలు	2024లో ఇచ్చిన సీసీఆర్ కార్డులు	2025-26లో కార్డుల జారీ లక్ష్యం	ఇప్పటివరకు ఇచ్చినవి
జగ్గయ్యపేట	25	2,774	3,500	259
పెనుగంచిప్రోలు	13	3,144	3,250	58
వత్సవాయి	26	4,041	4,200	246
నందిగామ	26	3,909	4,200	195
కంచికచర్ల	16	5,665	5,900	151
చందర్లపాడు	23	5,379	5,600	236
వీరులపాడు	26	4,162	4,600	65
మొత్తం	155	29,074	31,250	1,210

సీసీఆర్ కార్డుల కోసం వినతి...



గుర్తింపుకార్డులు జారీచేయాలంటూ వత్సవాయిలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

వాస్తవానికి ఏటా ఏప్రిల్ నెలలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఆయా సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి వారికి సీసీఆర్ కార్డులను అందజేయాల్సి ఉండగా ఆదిశగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటికే కొందరు రైతులు పొలాలను కౌలుకు తీసుకుని సాగుకు సిద్ధం చేస్తుండగా, మరికొంతమంది పత్తి విత్తనాలు కూడా నాటారు. సాగు ఖర్చుల కోసం డబ్బులు లేక రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ఈక్రమంలో తమకు సీసీఆర్ కార్డులు జారీచేయాలని కోరుతూ రైతులు, రైతుసంఘం నాయకులు ఇటీవల వత్సవాయి తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం కూడా అందజేయడం తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. ఇకనైనా కూటమి పాలకులు, అధికారులు స్పందించి తమకు సీసీఆర్ కార్డులను జారీ చేసి ఆదుకోవాలని డివిజన్ పరిధిలోని కౌలురైతులు కోరుతున్నారు.

కౌలురైతులను గుర్తించాలి...



ప్రభుత్వం కౌలురైతులను గుర్తించి వెంటనే అందరికీ సీసీఆర్‌సీ గుర్తింపుకార్డులు ఇవ్వాలి. లేనిపక్షంలో గతేడాది ఇచ్చిన కార్డులను రెన్యువల్ చేయాలి. వ్యవసాయమే ఆధారంగా బతికే కౌలురైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– తుమ్మల రామారావు, కౌలురైతు, శివాపురం

కార్డు ఉంటే ఎంతో మేలు...



పండించిన పంట అమ్ముకోవాలన్నా, బ్యాంక్ రుణాలు పొందాలన్నా కౌలురైతులకు గుర్తింపుకార్డులు తప్పనిసరి. విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతోపాటు కార్డులు జారీ చేస్తే మాలాంటి కౌలురైతులకు మేలు చేకూరుతుంది.

– మోరె ఛత్రాజీ, కౌలురైతు, షేర్‌మహ్మద్‌పేట

గుర్తింపు కార్డులు ఇవ్వాలి...



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు కౌలురైతులకు సీసీఆర్ కార్డులు అందలేదు. దీంతో పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కౌలురైతులందరికీ సీసీఆర్ కార్డులు జారీ చేయాలి.

– కనగాల రమేష్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

కూటమి పాలనంతా మోసపూరితం : తన్నీరు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా మోసం, దగా, కక్ష సాధింపుల మయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలసి సోమవారం ఆయన 'వైఎస్ జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని చీకట్లలోకి నెట్టివేసిందన్నారు. ఈ ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమానికి కృషిచేయగా, నేడు చంద్రబాబు, మంత్రి లోకేషులు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్ జగన్ అంటే ప్రజలకు ఓ నమ్మకం కాగా, చంద్రబాబు అంటే మోసమని రాష్ట్రప్రజలకు మరోసారి వెల్లడైందన్నారు. ఈ పుస్తకం కూటమి పాలన అసలు రూపాన్ని ప్రజల ముందుంచేందుకేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

సబ్‌కోర్టు మంజూరుకు వినతి



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటకు సబ్‌కోర్టు మంజూరుతోపాటు పెనుగంచిప్రోలు సివిల్ జ్యూరిడిక్షన్ మంజూరు చేయాలని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం మచిలీపట్నంలో కృష్ణాజిల్లా ప్రధానన్యాయమూర్తి జి.గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ప్రధానన్యాయమూర్తి గోపి సానుకూలంగా స్పందించినట్లు సుందరరావు తెలిపారు. కార్యక్రమంలో మచిలీపట్నం బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోతురాజు, సుధాకర్, బార్ సభ్యులు అరవింద్ పాల్గొన్నారు.

పోలంపల్లి డ్యాంను పూర్తిచేయాలని డిమాండ్



పాత ఆనకట్టకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

పోలంపల్లి(వత్సవాయి): అసంపూర్తిగా నిలిచిపోయిన పోలంపల్లి డ్యాంను రాష్ట్రప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శులు కేవీవీ ప్రసాద్, జమలయ్య డిమాండ్ చేశారు. జిల్లా రైతుసంఘ నాయకులతో సోమవారం వారు డ్యాంను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 19ఖానాలతో చేపట్టిన కొత్త డ్యాం నిర్మాణ పనులు తుదిదశలో ఉండగా, ఆయన ఆకాల మృతితో పూర్తికాలేదన్నారు. అప్పటి నుంచి నేటివరకు డ్యాం పనులను ఎవ్వరూ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇకనైనా పాలకులు స్పందించి డ్యాం పనులు పూర్తిచేయాలని కోరారు.

మునేటికి వరదలు వచ్చినప్పుడు పొలాలకు గండ్లు పడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత ఆనకట్టకు పడిన గండ్లను కూడా ప్రభుత్వం వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘ ఉపాధ్యక్షులు మందారావ్, జిల్లా రైతు సంఘ ప్రధానకార్యదర్శి చుండూరు సుబ్బారావు, రైతు సంఘ నాయకులు వల్లంకొండ బ్రహ్మం, నరసింహరావు, నల్లగర్ల లింగయ్య గుజ్జర్లపూడి స్వామి, పేరాబత్తిన రాఘవేంద్ర, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీసు ఎదుట కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్, కార్మికులు

నందిగామరూరల్: పారిశుద్ధ్య కార్మికులకు ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లోని కోటిన్నర మంది ప్రజల అవసరాలను తీరుస్తూ ప్రజారోగ్యం, పర్యావరణాన్ని కాపాడేందుకు 48వేల మంది కార్మికులు సేవలందిస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం కనీసం స్పందించకపోగా సంక్షేమ పథకాలను సైతం అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

తల్లికి వందనంతోపాటు భవిష్యత్‌లో అమలు చేసే సంక్షేమ పథకాలను కార్మికులకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, సైదా, మాణిక్యం, నాగరాజు, శ్రీను, శ్రావణి, దాసు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అంగన్‌వాడీలకు అన్యాయం



ధర్నా చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

నందిగామటౌన్: ఎన్నికలకు ముందు చిరుద్యోగులకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అందించకుండా అంగన్‌వాడీలను మోసం చేస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే కూటమి నేతలు విస్మరించారన్నారు. రూ. ఏడు వేలు వేతనం తీసుకునే హెల్పర్‌లు, రూ. 11,500ల జీతం తీసుకునే అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులని చెబుతుండటం ప్రభుత్వానికే సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలు తదితర చిరుద్యోగులకు ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి సరళ, మహాలక్ష్మి, వెంకట్రావమ్మ, సుజాత, వేణు, లక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన : ఎమ్మెల్యే

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో సోమవారం తల్లికి వందనం పథకంలో భాగంగా తల్లుల ఖాతాల్లో నగదు జమచేస్తుండటాన్ని హర్షిస్తూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగంలో గతంలో ఎన్నడూ చూడని విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడమే కాకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు వివరించారు. తల్లికి వందనం నగదును తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట ఆందోళన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ధర్మవరప్పాడుతండ పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను యథావిధిగా కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట గ్రామస్తులు సోమవారం ఆందోళన చేశారు. అనంతరం పీజీఆర్‌ఎస్‌లో భాగంగా ఎంపీడీవో నితిన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాలలో ఉన్న ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను జయంతిపురంలోని జెడ్పీ పాఠశాలలో విలీనం చేయడంతో గ్రామానికి చెందిన విద్యార్థులు ఐదు కిలోమీటర్ల వేర నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఆయా తరగతులను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జ్వాలా నాయక్, నారాయణ, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లోర్‌లీడర్‌కు సత్కారం



ఫ్లోర్ లీడర్ యాకుబ్‌అలీని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నికైన షేక్ యాకుబ్‌అలీని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు సోమవారం ఘనంగా సత్కరించారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రజాగళాన్ని వినిపించాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడాలని డాక్టర్ జగన్‌మోహనరావు సూచించారు. స్థానిక వైఎస్సార్ సీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు ఓర్సు జ్వాలా, పాములపాటి రమేష్, గాడిపర్తి రామకృష్ణ, ఓర్సు కొండ తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఏకాగ్రత సాధ్యం

నందిగామ రూరల్: యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా చదువులో బాగా రాణించవచ్చని యోగా గురువు గాడిపర్తి సీతారామారావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీఅక్షర ప్రైమ్ కళాశాలలో సోమవారం యోగా తరగుతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గడుపూడి శ్రీరామ్, డైరెక్టర్ కోటేశ్వరరావు, యోగాంధ్ర కోఆర్డినేటర్లు కృష్ణమోహన్, కవిత,విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంకు సన్మానం



ముండ్లపాడులో హెచ్‌ఎం ఎస్‌కే ఖాజాను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



గొట్టుముక్కలలో మందా సుధాకర్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం జేమ్స్, ఉపాధ్యాయులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ బదిలీపై నందిగామ వెళ్తున్న ఎస్‌కె ఖాజాను పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం ఖాజా మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో తనకు సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, హెచ్‌ఎం బి.లింగయ్య, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గొట్టుముక్కల(కంచికచర్ల) : మండలంలోని గొట్టుముక్కల ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న మందా సుధాకర్‌తోపాటు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జయరాణి, జానకీలను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అమర్లపూడి జేమ్స్, ఉపాధ్యాయులు పులి శ్రీనివాసరావు, అక్కల అంజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈత పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులు



ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కోచ్ చందు

నందిగామరూరల్: ఇటీవల నిర్వహించిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చాంపియన్‌షిప్ ఈత పోటీలలో స్థానిక కాకతీయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యా సంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాధ్ తెలిపారు. ఈతపోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులను స్థానిక పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొనగా ముగ్గురు బంగారు, ఐదుగురు కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. అనంతరం స్విమ్మింగ్ ట్రైనర్ చందును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ కాపా భారతి, కార్తికేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.